ప్లాట్‌ఫాం గందరగోళంగా వుంది. ప్రయాణీకులు తమకు రావలసిన బండికోసం రెండు ప్రక్కలా వున్న రైల్వేలైను కనిపించినంతమేరా చూస్తూన్నారు. సాయంకాలం క్రమంగా చీకట్లోకి కలిసిపోతోంది.

అది చిన్న రైల్వే స్టేషన్, పాసింజర్లు మాత్రమే ఆగుతాయి.

ఆరున్నర అవుతూనే పాసింజర్ రైలు వచ్చింది. చాలమంది ప్రయాణీకులు ఆ రైలులో వెళ్లిపోయారు. ప్లాట్‌ఫాం మీద అక్కడొకరూ యిక్కడొకరూ మిగిలిపోయారు.

ఒక యువకుడు ప్లాట్‌ఫాంమీద తచ్చాడుతూ, బుకింగ్ కౌంటర్ వైపు నడిచాడు.

# అపూర్వ నిధి

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"ఇటుప్రక్క వెళ్లే పాసింజర్ కూడా యిప్పుడే రావాలి కదండి!" అన్నాడు యువకుడు.

బుకింగ్ క్లర్క్ అతడిని ఎగాదిగా చూచి, "ఇక్కడే రెండు బళ్ళు క్రాస్ కావాలండి! ఈ రోజు మీరు వెళ్ళే బండి లేటు" అన్నాడు.

"మీరు యిటీవలనే వచ్చారా"?

"అవును, నాలుగు రోజులయింది యిక్కడ ఛార్జి తీసుకుని", అందుకే నేను మీకు తెలియకపోవచ్చును లెండి, క్లర్క్ తలూపి, "మీరెవరు?" అన్నాడు.

"సత్యప్రసాద్, ప్రసాద్ గార్డెన్స్ తెలుసుకదా. అది మాదే".

"ప్రసాద్ గార్డెన్ ఎస్టేట్... ఓహ్! చాల సంతోషం గార్డెన్స్ పేరు వినడమేగాని ఎన్నడూ చూడ లేదు సార్".

"రండి ఒకసారి ప్రకృతి అందచందాలకు మా గార్డెన్స్ పెట్టింది పేరు".

"ఆహా! మీ తాతయ్యగారు పోతూ మీకే అదంతా రాశారట కదా?"

"అవునండి".

"ఎస్టేట్ విలువ ఎంత వుంటుందండి?"

"వుంటుంది లెండి... యిప్పట్లో అయితే ముప్పయి - ముప్పయి అయిదు లక్షలు చేస్తుంది.

క్లర్క్ నోరావులించాడు. సత్యప్రసాద్ సగర్వంగా చూశాడు. ఒకసారి చుట్టూ ప్లాట్‌ఫాం అంతా కలియ చూశాడు. ప్లాట్‌ఫాంమీద సిమెంటు బెంచీమీద ఎవరో కూర్చున్నారు. అతడికి దగ్గరలోనే ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది.

తలవొంచి న్యూస్ పేపర్ చదువుకుంటున్నాడు. అతడి కళ్ళకు నల్లట అద్దాలున్నాయి. అకస్మాత్తుగా అతడు తలత్రిప్పి సత్యప్రసాద్‌ను చూశాడు.

సత్యప్రసాద్ కనుబొమలెగరేసి పెదిమలు త్రిప్పాడు చీకట్లో నల్లకళ్ళద్దాలేమిటి?

బుకింగ్ క్లర్క్‌ని మరల గర్వంగా చూచి, "మా తాతగారి ఎస్టేట్ వుండబట్టే యిక్కడ ఈ రైల్వే స్టేషన్ వెలసిందండి" అన్నాడు.


"అవునట, విన్నాను".

సత్యప్రసాద్ మరొకటి రెండు నిమిషాలపాటు మాట్లాడి నల్లకళ్ళద్దాల వ్యక్తివైపు కదిలాడు. అతడు అప్పటికి తిరిగి పత్రిక చదువు కోవడంలో మునిగి పోయాడు.

సిమెంట్ బెంచీవైపు నడిచి దానిమీద కూర్చొన్నాడు సత్యప్రసాద్.

"మీరూ యిటు ప్రక్కకేనా?" అడిగాడు సత్యప్రసాద్.


"ఒకవ్యక్తికోసం చూస్తున్నాను" నల్ల కళ్ళద్దాల వ్యక్తి అప్పుడు తలెత్తాడు. "అతడు ఎవరో ఎలా వుంటాడో



నాకే తెలియదు. స్టేషన్‌కి బయలు దేరినట్టు మాత్రం తెలిసింది''.

''అతడు రాకపోతే బండికి రారా?''

''నేను బండికిరాను, అతడు దొరక్కపోతే తిరిగి ప్రసాద్ గార్డెన్స్‌కి వెళ్ళాలి''.



''మీకు ప్రసాద్ గార్డెన్స్ తెలుసా?''

''తెలుసా ఏమిటి? ఈ ప్రకృతి మీద ఎవరికయినా హక్కు వుంటుంది. ప్రసాద్ గార్డెన్స్ మీద నాకు అంతకంటె ఎక్కువే హక్కు వుంది''.

సత్యప్రసాద్ గుండెల నిండుగా నవ్వి, ''మీరు కూడా నాకు లాగానే ప్రకృతి ఆరాధకులన్నమాట'' అన్నాడు.

అతడు నల్ల కళ్ళద్దాలు సవరించుకున్నాడు.

''మీకో విషయం చెప్పనా?'' తిరిగి అన్నాడు సత్య ప్రసాద్.

''చెప్పండి''.

''నాకు యింత సంతోషం ఎందుకు కలుగుతుందో తెల్సా?''

''చెప్పనిదే ఎలా తెలుస్తుంది?''

''ఎందుకో మీతో అన్ని విషయాలు చెప్పాలనిపిస్తోంది''.

''వూ .''

''నాకు ఎవరివల్లనయితే ప్రాణగండం వున్నదన్నాడో మా తాతయ్య— ఆ వ్యక్తిని జెయిలులో వురితీశారు''.

''ఎవరా వ్యక్తి?''

''రామ్మూర్తి, ఏ కాక్టి లోకసంహారః అని విన్నారా!''

''విన్నాను''.

''గుడ్, అతడికి కుడికంట్లో పువ్వు వుంటుంది. నల్ల గుడ్డు మొత్తం పువ్వుతో మూసుకుపోయి వుంటుంది. అతడివల్లనే నాకు ప్రాణగండం వున్నదట''.

''జోస్యమా? అయితే నమ్మకండి!''

''ఇంకా ఏం నమ్మకం; మా తాత ప్రసాద్‌గారు ఆయన కష్టంతోనే ప్రసాద్ గార్డెన్స్ రూపొందింది''.

''మీ నాన్నగారూ?''

''మానాన్నగారిని కంట్లో పువ్వు పూసిన రామ్మూర్తి పొట్టన పెట్టుకున్నాడు''.

''అరరె... !''

''మాది గొప్ప సస్పెన్స్ చరిత్ర. చెప్పమంటారా?''

నల్ల కళ్ళద్దాలతడు తలూపాడు.

సత్యప్రసాద్ ఉత్సాహంగా మొదలుపెట్టాడు.

## 2

ప్రసాద్‌గారు దగ్గుతున్నారు. కింద హాలులో గడియారం పన్నెండు గంటలు కొట్టింది. ప్రసాద్‌గారు మెల్లగా చెయ్యిచాపి టీపాయ్ మీద మాత్ర అందుకున్నారు. మంచినీళ్ళు పుచ్చుకుని మాత్ర మింగారు. బెడ్ మీద వెల్లకితలా పండుకున్నారు.

నిద్రపట్టడంలేదు. బెడ్‌మీద అటూ యిటూ దొర్లారు.

ఎక్కడో చప్పుడవుతోంది.

ప్రసాద్‌గారు వులిక్కిపడ్డారు. పదునైన వస్తువుతో గట్టినేలను త్రవ్వుతున్నట్టు శబ్దమవుతోంది. అందుకే తనకు నిద్ర పట్టడం లేదు. ప్రసాద్‌గారు బెడ్ దిగారు. గదిలోంచి వరండాలోకి వచ్చారు. చప్పుడు క్రింద గదుల్లో అవుతోంది. ఏ గదిలోనో ప్రత్యేకంగా తెలియడంలేదు. ప్రసాద్‌గారు ప్రక్కగది ముందు నిలబడి తలుపు తట్టబోయారు.

కొడుకును లేపడమా మానడమా? 'అసలు చప్పుడేమిటి' అది తెలియకుండా కిషోర్‌ను లేపడం ఎందుకు.

మెట్లు దిగారు ప్రసాద్‌గారు చెవులు రిక్కించి విన్నారు. మూల గదిలోంచి వస్తోంది చప్పుడు. ఆ గదిముందు నిలబడ్డారు ఆయన. ఆ గది తలుపులూ కిటికీలూ మూసి వున్నాయి. ఆ గది దేవుడి గది. ఆ గదిలోంచి చప్పుడురావడం ఏమిటి?

లోపల ఎవరో తవ్వుతున్నారు. గచ్చునేల త్రవ్వుతోన్నట్టు మధ్యమధ్య ఖణేల్ మంటోంది. ప్రసాద్‌గారు యిక ఆగలేకపోయారు. తలుపులు బద్దలు కొట్టారు. తానేం చేస్తున్నారో ఆయనకి స్పృహలేదు. లోపల వున్నది శత్రువులే: సందేహంలేదు. తాను ఒంటరిగాడు. శత్రువులు తలుపు తెరచి తనమీద తిరగబడితే? ఆయనలో ఇంగితం వచ్చేసరికి తలుపు తెరచుకుంది. తలుపు తెరచిన వ్యక్తి చేతిలో గునపం వుంది. అతడు చెమటలు కక్కుతున్నాడు.

''ఎవరు నువు?'' అరిచారు ప్రసాద్‌గారు.

''నేను ఎవరినని చెబితే నీకు అర్థమవుతుంది? ఈ నేలమాది. ఈ నేలను నువు జబర్దస్తీగా లాక్కున్నావు. ఈ నేల మీద మా యిల్లు వుండేది. నీవు నడిపించిన బుల్ డోజర్ మా యింటిని పొట్టనపెట్టుకుంది''. అతడి కళ్ళు ఎరుపెక్కాయి. ఒక కంట్లో తెల్లటి పువ్వుంది. పువ్వుమీద ఎర్రటి రక్తం చారలు ప్రాకాయి. ఆ సమయంలో అతడు చాల భయంకరంగా వున్నాడు.

''ఏమో నాకు తెలియదు''.

''అవును నీకు తెలియదు. ఎన్ని యిళ్ళు కూల్చి, ఎంతమంది పేదలను చంపి, ఎంత రక్తం నీ పునాదికి పోసి గట్టి పరచావో నీకు తెలియదు. మా యింట్లో ఆ సమయంలో నా తల్లి వుండేది. నా తల్లి నీ బుల్‌డోజర్ క్రింద నలిగిపోయింది''.


''ఓహో! నువు ఎలా బతికిపోయావు?''

''నేను లేనురా! నేను వచ్చేటప్పటికే అంతా అయిపోయింది. నేనే వుంటేనా!''......

''వూ, వుంటే?''

''నిన్ను చంపి నీ ప్రేగులు నామెడలో వేసుకునే వాడిని''.

ప్రసాద్‌గారు అతడి మాటల తీవ్రతకు నిర్ఘాంతపోయారు. అతడు అన్నంతపనీ చేసేలాగా వున్నాడు.



నీరసం, వణుకూ, ఆవేశం కలగలిసి ఆయన బలహీన పడ్డాడు. గుండె పట్టుకున్నాడు.

కంట్లో పువ్వు వున్నవాడు పకపక నవ్వాడు.

"కంగారు పడకు ! నిన్ను అంత సులువుగా చంప నులే. నాకు తల్లిపోయిన శోకం' ఎలా యిచ్చారో... నీ కళ్ళ ఎదుటనే నీ కొడుకు వాడికొడుకుతో బాటు చస్తే... ఆ శోకం ఎలా వుంటుందో నీకు రుచి చూపించాలి కదా?"

ప్రసాద్‌గారు నేలమీదకు పడిపోయారు. అతడు వికటంగా నవ్వి తిరిగి లోపలకు వెళ్ళి తలుపు మూసుకున్నాడు. నిర్విరామంగా గునపంపోట్లు గచ్చుమీద పడుతున్నాయి.

## 3

"అప్పుడు నన్ను పిలవ లేక పోయారా నాన్న గారూ?" కోపంగా అడిగాడు కిషోర్.

ప్రసాద్‌గారు నీరసంగా తలత్రిప్పారు. "పిలిచే అవకాశం దొరకలేదు. పైగా అతడి గదిలో ఏం తవ్వుతున్నాడో తెలియదు. ఆ విషయం తెలుసుకోవాలి".

"ఏం తవ్వుతాడు - వాడిమొహం?"

"అలా తీసెయ్యక వాడి యింట్లో ఏదో నిధి వుండి వుండాలి".

"పేదవాడి యింట్లో నిధా? గుడిసెలో ఏం వుంటుంది వాడి మొహం? అయినా ఎక్కడని త్రవ్వుతాడు? ఇంత విశాలమైన భవనం కట్టాక కిందినేల ఎంత అణిగిపోతుందో తెలుసా?"

"నువు అతడి ప్రయత్నాన్ని అంత తేలికగా తీసి పారెయ్యక!"

"ఆల్‌రైట్, ఏం చేయమంటారో చెప్పండి"

"అతడు యింట్లోకి ఎలా ప్రవేశించాడు: దేవుడి గదికి మనం తాళం కూడా పెట్టాం".

"వాచ్‌మాన్ కళ్ళు కప్పి పట్టపగలే ప్రవేశించి వుంటాడు. తాళం కప్పకి ఏముంది? అలాంటి వాడికి తాళం కప్పలు సలాం చేస్తాయి".

"అతడు యింట్లోంచి ఎప్పుడు ఎలా మాయ

## అంతరం

వెన్నెల్లో విస్కీ కలుపుకు తాగుతూ
కాలేజీ బ్యూటీతో పూటీలో విహరించే—
ఊహిస్తూ విహరించే
విహరిస్తూ ఊహించే యువతరం
చివరికి చీకట్లో
చీకటి మైకంతో మేల్కొని
చిందులేసి...మళ్ళీ
చీకట్లో నిద్రోతుంది—
ఇది గెలుపు యువతరం కాదు
ఇది నలుపు యువతరం

—ఎమ్.ఎస్.ఎన్. శేషు

మయ్యాడో మనకి తెలియదు. దేవుడిగది మొత్తం త్రవ్వి పారవేశాడు".

"అయితే ఈ రాత్రికి అతడు తిరిగి వచ్చేటట్టయితే మరో గదిని తవ్వుతాడు".

"అవును, అతను తప్పక వస్తాడు".

"మనం పోలీసులకు చెప్పివుంచితేనో?..."

"పోలీసులు యిప్పుడు వస్తే ప్రమాదం. అతడు దేనికోసం వెదుక్కుంటున్నాడో మనకు తెలియాలి. నిధికోసం అయితే ఆ నిధిని మనం దొరక బుచ్చుకోవాలి.

"ఆలోచన బాగుంది. నాన్నగారూ!"

"కాని నువు వాడికంట పడకూడదు".

"ఏం నాన్నగారూ?"

"వాడు నీ మీద, నీ కొడుకు సత్యప్రసాద్ మీద పగబట్టాడు..."

కిషోర్ పళ్ళు నూరాడు. "అలా అయితే వాడిని బతకనివ్వగూడదు".

"తొందరపడక!"

సత్యప్రసాద్ మంచంమీద కదిలాడు "మమ్మీ..." అన్నాడు. ప్రక్క గదిలోంచి కిషోర్ భార్య పరుగెత్తుకు వచ్చింది.

## 4

తలుపులు బార్లా తెరచి వుంచాడు కంట్లో పువ్వు వేసిన వ్యక్తి. ప్రసాద్‌గారు మెట్ల మీద కూర్చుండి చోద్యం చూస్తున్నారు. త్రవ్వుతోన్న వ్యక్తిని పలకరించారు.

"నన్ను రామ్మూర్తి అని పిలువు" అన్నాడు అతడు.

"నువు దేనికోసం నా యింటిని మొత్తం త్రవ్వి పోగులు పెడుతున్నావో తెలియదు మూడు గదులు త్రవ్వావు. మెయిన్ హాలు సగం త్రవ్వి పోగులు పెట్టావు".

"నీ యింట్లో నాకు కావలసిన నిధి వుంది. ఆ నిధి దొరికే వరకూ యిలాగే త్రవ్వుతాను"

"నిధి దొరక్కపోతే..."

"నీ భవనం మొత్తం కూల్చేస్తాను", రామ్మూర్తి చెమట తుడుచుకున్నాడు. గునపం ప్రక్కకు పెట్టాడు- బీడీ ముట్టించాడు.

"నీ నిధి ఏమిటో నాకు చెప్పు. నేను నీకు దాని ఆచూకీ చెప్పగలనేమో చూస్తాను".

రామ్మూర్తి విసురుగా బీడీని అతడివైపు విసిరి కొట్టాడు. "నీ మొహం చూస్తావు". అంటూ తిరిగి గునపం అందిపుచ్చుకున్నాడు.

త్రవ్వకం మొదలయింది.

"మామయ్యగారూ!"

ప్రసాద్‌గారు తల త్రిప్పారు వరండాలో గది తలుపు వెనకనుండి కోడలు పిలుస్తోంది.

ప్రసాద్‌గారు కంగారుగా మెట్లు ఎక్కి కోడలిని సమీపించారు.

"కాఫీ త్రాగుతారా?" అంది కోడలు. ఆమె చేతిలో కాఫీ కప్పవుంది. "నాన్సెన్స్, నువు అసలు యింట్లో వున్నట్టు తెలియకూడదన్నానా?" విసుక్కున్నారు ప్రసాద్‌గారు.

"ఏమవుతుంది మామయ్యగారూ!" అడిగింది కోడలు.

"అదిగో... గచ్చు తవ్వుతున్నాడే, వాడు దుర్మార్గుడు..." ప్రసాద్‌గారి మాట పూర్తి కానేలేదు. కోడలి చేతిలోని కాఫీ కప్పును రామ్మూర్తి అందు కున్నాడు.

ప్రసాద్‌గారి మొహంలో భయాందోళనలు స్పష్టంగా కదిలాయి. కోడలు లోపలికి పారిపోయింది.

"నీ కోడలును నేను ఏమీ చేయనులే, నీకే పుత్ర శోకం, పౌత్ర శోకం జమిలిగా కలిగిస్తాను.

ప్రసాద్‌గారు నిర్ఘాంతపోయి చూస్తూండి పోయారు. రామ్మూర్తి వేడి కాఫీని గట గట త్రాగేశాడు.

## 5

పెరట్లో త్రవ్వకం మొదలు పెట్టాడు రామ్మూర్తి. తోట త్రవ్వి తిరగ వేయసాగాడు. పదిహేను రోజులయింది. కాని అతడి ప్రయత్నం ఫలించినట్టులేదు.



భవనంలో ప్రసాద్‌గారూ ఆయన కొడుకు యీ విషయమై చర్చించుకుంటున్నారు.

"అతడిని మనం యిలా ఎంత కాలం సహిస్తాం? అడిగాడు కిషోర్.

"తొందరపడక ఇంటి విషయం మరమ్మత్తులకు చెప్పాను. అతడు పిచ్చివాడు. అతడికి కావలసిన నిధి ఏమిటో అతడికే తెలియదు. తుపాకీ తీసుకురా" అన్నాడు ప్రసాద్‌గారూ.

"పెరట్లోనే కాల్చి పార వేద్దామా?" ప్రసాద్‌గారూ తలూపారు. కిషోర్ గోడకి వేలాడుతున్న డబుల్ బారెల్ రైఫిలు అందుకున్నాడు. మాగజైన్ తెరచి తూటాలు చూశాడు. తిరిగి రైఫిల్‌ను యధాప్రకారంగా అమర్చి తండ్రి వద్దకు వచ్చాడు. తండ్రి కిటికీ వద్ద నుంచి చూస్తున్నాడు.

రామ్మూర్తి దీక్షగా పెరడు త్రవ్వేస్తున్నాడు. ప్రసాద్‌గారు కొడుకుదగ్గరనుంచి రైఫిలు అందుకున్నారు. ట్రిగ్గర్ లాగి చూసుకున్నారు. కిటికీ రెక్క ఓరగా తెరిచారు. రైఫిలును కంటికి తిన్నగా పెట్టి గమ్యం పరిచూసుకున్నారు.

రామ్మూర్తి వీపు అతడి వైపు వుంది. కుడిచేతితో ఏదో వస్తువును పట్టుకుని చూస్తున్నాడతడు.

ప్రసాద్‌గారు రైఫిలు ఎత్తారు. కిషోర్ ఆత్రుతగా రామ్మూర్తి వైపు చూస్తున్నాడు. కొన్ని క్షణాలలో రామ్మూర్తి తాను త్రవ్వుకొన్న గోతిలో తానేపడతాడు. ప్రసాద్‌గారు ట్రిగ్గర్ లాగి వదిలారు. 'ఢాం' శబ్దమయింది.

రామ్మూర్తి గోతిలో పడ్డాడు. తండ్రీ కొడుకులు మొహాలు చూసుకున్నారు.

"తూటా తగిలింది కదూ!" అడిగారు ప్రసాద్‌గారు.

"తగలనిదే అతడు ఎలా పడతాడు నాన్నగారూ?" అన్నాడు కిషోర్.

ప్రసాద్‌గారు మాట్లాడలేదు. దీక్షగా పెరట్లోకి చూస్తూనే తిరిగి రైఫిలును గురిపెట్టారు.

రామ్మూర్తి లేవలేదు. ప్రసాద్‌గారు మెల్లగా గుమ్మం లోంచి పెరట్లోకి నడిచారు. తుపాకీ గురిపెట్టి వుంచే గోతిని సమీపించారు. అకస్మాత్తుగా ఆయన కళ్ళలోకి మట్టి చిమ్మింది. ప్రసాద్‌గారు తుళ్ళిపడ్డారు.

రామ్మూర్తి ఎప్పుడు గోతిలోంచి గెంతాడో, రైఫిలును ప్రసాద్‌గారి చేతిలోంచి ఎప్పుడు తుళ్ళగొట్టాడో తెలియదు. కాని కిషోర్ చూచేటప్పటికే ప్రసాద్‌గారు నేలమీద పడిపోయారు. రామ్మూర్తి రైఫిల్ వైపు పరుగెత్తాడు. కిషోర్ ప్రమాదం గుర్తించాడు. రామ్మూర్తి తన తండ్రిని కాల్చి పారేస్తాడు. ఇదే అవకాశం, కిషోర్ పరుగెత్తుకు వచ్చాడు.

"నువు రాకురా, రాకు!" ప్రసాద్‌గారు అరిచారు. పిచ్చికోపంతో గుప్పిళ్ళతో మట్టిని తీసి రామ్మూర్తి వైపు విసిరారు.

కిషోర్ ఆగిపోయాడు. వెనక్కు గెంతి తలుపు చాటున ఆగాడు. రామ్మూర్తి వికటంగా నవ్వి, రైఫిలును ప్రసాద్‌గారికి గురిపెట్టాడు.

తోట అవతల గందరగోళంగా వుంది. రైఫిలు ప్రేలిన చప్పుడుకి జనం తోట ఆవరణ చుట్టూ చేరారు.

"ఒరేయ్... కిషోర్... ఎదవనాయాలా! మీయిద్దరి ప్లాన్ నాకు తెలుసునొరేయ్: అటు తిరిగి అద్దం లోంచి మీ యిద్దరి మొహాలు కనిపెడుతున్నాను. కమాన్... నువ్‌రాకపోతే మీనాన్నను కాల్చి పారేస్తాను" రైఫిలును కాల్చుతోన్నట్టు అభినయించాడు రామ్మూర్తి.

"నువురాకు... వీడు నన్ను ఏమీ చేయడు". ప్రసాద్‌గారి అరుపులను కిషోర్ పట్టించుకోలేదు. తండ్రివద్దకు పరుగెత్తుకు వచ్చాడు.

రైఫిలు ఢాం మంది. కిషోర్ ఎగిరిపడ్డాడు.

జనం తోట కంచెదాటి లోపలకు వచ్చారు. ప్రసాద్‌గారు పిచ్చి కోపంతో రామ్మూర్తిని మోకాళ్ళ వెనుక తన్నారు. రామ్మూర్తి వెల్లికితలా పడ్డాడు.

జనం రామ్మూర్తిని బంధించేశారు.

## 6

అది సార్ కథ... కంట్లో పువ్వు వేసిన రామ్మూర్తి జెయిలుకి వెళ్ళాడు. తర్వాత మా తాతయ్య నన్ను దగ్గరికి పిలిచి," నాయనా 'సత్యప్రసాద్' రామ్మూర్తి మాటకు కట్టుబడే నన్ను చంపలేదు. మీ నాన్నను దారుణంగా నా కళ్ళ ఎదుటనే చంపాడు. వాడి దృష్టిలో యిక నువ్వు ఉన్నావు. నీ ప్రాణాలు కాముకో!" అన్నారు.

"వాడికి వురి వేయించు తాతయ్యా" అన్నానట నేను.

ఆయన నవ్వి, "ఆ ఏర్పాటు చేశానులే బాబూ" అన్నారు. కాని... సార్... రామ్మూర్తి తనకు తానే జెయిలులో వురిశిక్షకు సిద్దపడ్డాడట. ఆ విషయం పోలీసులు గొప్పగా భావించారట. అతడి మనశ్శాంతి కోసం అతడిమీద ఉరిశిక్ష అమలుజరిపారట" అన్నాడు సత్యప్రసాద్.

లేచి వెళ్ళి కుండలో నీళ్ళు త్రాగివచ్చి మరల కళ్ళ జోడు వ్యక్తి వద్ద కూర్చున్నాడు.

"మీరు యీ విషయం వార్తా పత్రికలో చదివారా?"

"అవును, నవోదయం వార్తా పత్రిక, బాక్స్ కట్టి మరీ వేశారు".

"అది వార్తకాదు, ప్రకటన".

"ప్రకటనా?"

"అవును వారంరోజులుగా రోజూ పేపర్‌లో పడుతోంది. దాన్ని మీరు యిరోజే చూచి వుంటారు. అందుకే ధైర్యంగా బయటకు" రాగలిగారు.

"అవును ప్రకటన అని నీకు ఎలా తెలుసు?"

నల్ల కళ్ళద్దాలవ్యక్తి గుంభనంగా నవ్వాడు.

"ప్రసాద్‌గారి యింట్లో రామ్మూర్తి వెతికిన నిధి ఏమిటో తెలిసిందా?"

వుహుఁ, మా తాతయ్య చెప్పలేదు, ఆయనకీ తెలియదు".

"రామ్మూర్తి తల్లి బుల్‌డోజర్ క్రింద భూస్థాపితం అయింది. ఆమె ఎముకలకోసం రామ్మూర్తి వెతికాడు".

"మీకెలా తెలుసు?"

"కొడుకుకు అంతకంటె అపూర్వ నిధి ఏముంటుంది?" అతడి చేతులు వణికాయి. మెల్లగా నల్లకళ్ళద్దాలు తీశాడు. సత్యప్రసాద్‌కి నోటమాట లేదు.

అతడి కంట్లో తెల్లటి పువ్వు వుంది, ఎర్రజీరలతో

---

### కాలక్షేపం బఠాణీ కథ

## శనివారప్పేట దాంపత్యం

'రాధికా కేఫ్' లో ఎక్కడా ఖాళీలేదు. రామం ప్రక్కనున్న గదిలో కాలుపెట్టాడు. "ఇది ఫామిలీ రూమ్,సార్!" అన్నాడు చటుక్కున వచ్చి సర్వర్. బోర్డులేకపోయినా, ఇంతకుముందే వచ్చిన ఇద్దరు ఆడవాళ్లు మాత్రం అందులో ఉన్నారు."ఆయన మాచుట్టమే! రానీ!" అంది, అందులో ఒకామె. ఆపైన సర్వర్ కిమ్మనలేదు. రామం ఇడ్లీకార్డరు ఇచ్చాడు. వారూ అదే తెమ్మన్నారు. "మేము భవానీపురంలో ఉంటామండీ"! అని ఒకామె తమ వివరాలు చెప్పి, రామం వివరాలడిగింది. చెప్పాడు.



సర్వర్‌కు, రామం, కాఫీ ఆర్డరిచ్చాడు. వారూ 'డిటో' అన్నారు. చుట్టాలమని చెప్పినా, వారు విడివిడిగా వచ్చారు కనుక, విడివిడిగా బిల్లులిచ్చి వెళ్లిపోయాడు సర్వర్. ఒకామె రామం టేబుల్ దగ్గర తమబిల్లు పెడితే అతడు ఆశ్చర్యంగా చూశాడు.

"పూర్వం, శనివారప్పేట జమీందారు, చీరా, జామారూ, దంపతులకిచ్చేవారట! దంపతులు కాని వారికి కూడా దారిద్ర్యహేతువుచేత, వాటిమీద ఆశకలిగి, ఎడముఖంగా, పెడ ముఖంగా, దంపతులుగా పీటలమీద కూర్చొని ఆ కానుక ముట్టిన తర్వాత, ఎవరిదారిని వారు వెళ్లిపోయేవారట! వారు దంపతులుకాని దంపతులు, అట్లాగే, ఈ గది వరకూ మనం చుట్టాలు కాని చుట్టాలం! అందుచేత, మా బిల్లు మీరు చెల్లించండి ప్లీజ్!" అంది, దీనంగా రామం టేబుల్ దగ్గర చెల్లించాడు. ఒకరి వంకకు ఒకరు తిరిగి చూసుకోకుండా, ఎవరి దారిని వారు వెళ్లిపోయారు.

—పైడిపాటి సుబ్బరామశాస్త్రి